క్లుప్తంగా

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆర్డీఓకు వినతి



నందిగామటౌన్: సాధారణ ఎన్నికలలో విధులు నిర్వహించిన ఉద్యోగులు, సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణయ్య కోరారు. డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ నందిగామ ఆర్డీవో బాలకృష్ణను శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ సాధారణ ఎన్నికల విధులలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఓపీవో, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు. పలు దఫాలుగా నిర్వహించిన ట్రైనింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో నాయకులు మహేశ్వర వెంకటేశ్వర రావు, గంగరాజు, వెంకటాద్రి, తదితరులు ఉన్నారు.

ఈ వాహనాలకు మోక్షమెప్పుడో!



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారయంత్రాంగం, పరిసరాల పరిశుభ్రత కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆయా యంత్రాలను వినియోగించే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అందుకు చిల్లకల్లు మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడిఉన్న ట్రాక్టర్, పూడికతీసే యంత్రమే నిదర్శనం. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చెత్తసేకరణకు రిక్షాలతో పాటు గ్రామాల్లో డ్రైనేజీ శుభ్రతకు అధునాతన ట్రాక్టర్, డోజర్‌లను ప్రభుత్వం కేటాయించింది. అయితే కొన్నేళ్లుగా ఈ వాహనాలు మండల పరిషత్ కార్యాలయంలోనే నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రూ. లక్షల విలువైన అధునాతన యంత్రంతోపాటు వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరుపయోగంగా పడి ఉండటంతో అధికారుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా ట్రాక్టర్, పూడిక తీసే యంత్రాన్ని వినియోగంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

నందిగామటౌన్: ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు అందించిన సేవలు చిరస్మరణీయమైనవని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కొనియాడారు. పట్టణంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయం, సీఎం రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ సౌమ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ తన పాలనా విధానంతో తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందర్లపాడులో..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్టీ రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చందర్లపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి ఎస్‌ఎస్సీ డీసీ చైర్మన్ కోట వీరబాబు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేకల సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురంలో ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకుడు దాములూరి మధుసూధనరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. చౌటపల్లిలో గురిజాల అజయ్‌కుమార్, చట్టన్నవరంలో గురజాల హరికృష్ణ, జుజ్జూరులో కాపా రాంబాబు, బోడవాడలో మద్దినేని లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించి, ఆయనకు నివాళులర్పించారు.

జూదంతో యువత చిత్తు

- కోడి పందేలు, గుండాట, క్యాసినోతో ప్రజల జేబులకు చిల్లు
- లోన్‌యాప్‌ల ద్వారా అప్పులు చేసి మరీ పందేలు కాసిన వైనం
- కోట్లాది రూపాయలు పోగొట్టుకున్న జనం



సంక్రాంతి రోజున గండేపల్లిలో క్యాసినో ఆడుతున్న యువత(ఫైల్)

కంచికచర్ల: సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాల పేరుతో నందిగామ నియోజకవర్గంలోని యువత కోట్లాది రూపాయలను పోగొట్టుకోవడం ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మునుపెన్నడూ లేనివిధంగా కంచికచర్ల మండలంలో క్యాసినో ఏర్పాటు చేసి మరీ సంబరాల ముసుగులో యువత జేబులకు భారీగానే చిల్లుపెట్టారు. జేబులకు చిల్లు తప్పదని తెలిసినా అత్యుత్సాహంతో జనం జూదంలో పాల్గొని కోట్లాది రూపాయలను పోగొట్టుకున్నారు.

పందెం రాయుళ్లల్లో యువతే అధికం..

గతంలో కోడి పందేలు, గుండాటలు అంటే పెద్దవారు అధిక సంఖ్యలో ఉండేవారు. యువత మాత్రం సంక్రాంతికి ఏర్పాటు చేసే క్రికెట్, వాలీబాల్, ఇతర క్రీడల్లో పాల్గొనేవారు. కాని ఈ ఏడాది అధికశాతం యువత కోడి పందేలు, గుండాట, పేకాట వైపు మొగ్గుచూపారు. ఏ కోడి పందేల బరి వద్ద చూసిన యువతే అధికంగా కనిపించడం గమనార్హం. పెద్దవారు కోడి పందేలు తిలకించడానికి పరిమితం కాగా యువత కోడికి కత్తి కట్టడంతో పాటు పెద్దమొత్తంలో పందేలు కాయడంలో ముందువరుసలో ఉన్నారు. కొన్నిచోట్ల యువతులు, మహిళలు కూడా ఈ జూదంలో పాల్గొనడం గమనార్హం. హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నం, విజయవాడ నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్, ఇతర రంగాల ఉద్యోగులు, వ్యాపారం చేస్తున్న యువత డబ్బు లెక్క చేయకుండా కోడి పందేలు, గుండాటలో పాల్గొని జేబులు గుల్లచేసుకోవడం గమనార్హం.

లోన్‌యాప్‌ల ద్వారా భారీగా అప్పులు..

కోడి పందేలకు నగదు కోసం యువత ముందుగానే పలురకాల లోన్‌యాప్‌ల నుంచి భారీగా రుణాలు తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు పందెంరాయుళ్లు అధిక వడ్డీకి అప్పులు చేయగా, ఇంకొందరు వస్తువులు తాకట్టు పెట్టి మరీ ఈ జూదాల్లో పాల్గొన్నారు. సంక్రాతి కోడి పందేలు, పేకాట కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ జూదాల్లో పాల్గొని భారీమొత్తంలో నగదును నష్టపోయిన యువత, ఆయా అప్పులను ఇప్పుడెలా తీర్చాలా? అనే ఆందోళనకు గురవుతుండటం గమనార్హం. ఇలా సంక్రాంతి సంబరాల ముసుగులో కూటమి నాయకులు నందిగామ నియోజకవర్గంలో యువత నుంచి కోట్లాది రూపాయలను కొల్లగొట్టిందనే చర్చ గ్రామాల్లో జోరుగా సాగుతోంది. సంక్రాంతి పండుగ ముగిసినందున పందేల కోసం చేసిన అప్పులు తీర్చడం ఎలా అనే ఆందోళనలో యువత సతమతమవుతోంది.

చేతుల మారిన రూ.కోట్లు..



కంచికచర్ల మండలం గండేపల్లిలో జోరుగా సాగుతున్న కోడి పందేలు(ఫైల్)

నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా కంచికచర్ల మండలం గండేపల్లి, పరిటాల, చందర్లపాడు మండలం చందర్లపాడు, నందిగామ మండలం ఐతవరం మున్నేటి ఒడ్డున మామిడితోటల్లో కోడి పందేలు, లోనబయట , గుండాటలు మూడురోజుల పాటు జరిగాయి. కోడి పందేలు, ఇతర జూదాల్లో యువత కోట్లాది రూపాయలను నీళ్లప్రాయం చందాన ఒడ్డింది. నూటికి 10శాతం మంది పందేల్లో డబ్బు గెలిస్తే 90శాతం మంది యువత పందేల్లో భారీగా నగదు పోగొట్టుకుని తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోవడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయా కోడిపందేల బరులు, క్యాసినో వద్ద ఒక్కొక్కరు రూ. 10వేల నుంచి రూ. 50వేల వరకు పందేలు వేశారు. గ్రూపుగా రోజుకు రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు పందేల కాశారు. జేబుల్లో నగదు లేనివారి కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా మనుషులను పెట్టి క్యాష్ అందించే ఏర్పాట్లు చేశారు. ఫోన్‌పే, గూగుల్ పే సౌకర్యం కల్పించి 10శాతం కమిషన్‌తో నగదు అందించి మరీ జనం జేబులు గుల్లచేశారు.

సినిమా థియేటర్లు తనిఖీ



థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న పేట తహసీల్దార్ మనోహర్, రెవెన్యూ సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: సినిమా టికెట్లను ఆన్‌లైన్‌లో ఫేక్ బుకింగ్ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో జగ్గయ్యపేట తహసీల్దార్ పి.మనోహర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం పట్టణంలోని సినిమా థియేటర్లను తనిఖీ చేశారు. అలంకార్, కమలా థియేటర్లను తనిఖీ చేసి సంబంధిత రికార్డులను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అలంకార్ థియేటర్ నామ్స్‌లో ఫ్రీగా ఇవ్వాల్సిన వాహనాల పార్కింగ్‌కు మల్టీప్లెక్స్ థియేటర్ పేరుతో డిస్‌ప్లే బోర్డు పెట్టి మరీ డబ్బులు తీసుకుంటున్నారని గుర్తించారు. అలాగే ఆహారపదార్థాల వద్ద ధరలపట్టిక డిస్‌ప్లే బోర్డు లేకపోవడంపై థియేటర్ మేనేజర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఫేక్ బుకింగ్ చేసి అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రేక్షకులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సూర్యకుమారి, వీఆర్‌వోలు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర తదితరులు



చందర్లపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది, నాయకులు

నందిగామ టౌన్: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్, పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బంది కలిసి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చందర్లపాడు మండలంలో..

పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని సర్పంచ్ కస్తాల పున్నమ్మ పేర్కొన్నారు. చందర్లపాడులో శనివారం స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ ఎస్‌ఎస్సీ డీసీ చైర్మన్ కోట వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదివస్ నిర్వహించి, పరిసరాలను శుభ్రం చేశారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : స్వచ్ఛ దివస్ థీమ్ కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ తడి,పొడిచెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పంచాయతీ విస్తరణాధికారి బొజ్జగాని శ్రీనివాసరావు, కార్యదర్శి బ్రహ్మం, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లోనూ స్వచ్ఛదివస్‌ను నిర్వహించారు. గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, చెవిటికల్లులో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, కొత్తపేటలో పత్తిపాటి సునీత, కీసరలో పేరం నర్సమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, నానిబాబు, సోమిరాజు, ఫణీంద్రనాయక్, వనిత, రాజ్యలక్ష్మి, అనిత, రాంజీ, అబ్దుల్‌నజీర్, ఏఎన్‌ఎంలు, వీఆర్వోలు, అంగనవాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్య సమస్యలు దరి చేరవని సర్పంచ్ మారపాక మహాలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జయంతి గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గ్రామంలోని డ్రైన్లలో పూడిక తీశారు. వైద్యాధికారి దీపిక, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గౌరవరంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈవోపీఆర్డీ పద్మావతి

స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు వేద్దాం..

జగ్గయ్యపేట అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ జగ్గయ్యపేట కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పిలుపునిచ్చారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి క్కరూ సహకరించాలన్నారు. స్వచ్ఛ జగ్గయ్యపేట కోసం పట్టణ ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రతను పాటించాలన్నారు. తడిపొడి చెత్తలను వేరుచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ అందరి సహకారంతోనే జగ్గయ్యపేట మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా జగ్గయ్యపేట రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ పి.మనోహర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించారు. ఆర్ఐ సూర్యకుమారి, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, సర్వే, పీడీఎస్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో క్లీన్‌నెస్ డ్రైవ్ ...

స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో క్లీన్‌నెస్ డ్రైవ్ నిర్వహించారు. శానిటేషన్ సిబ్బంది, వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుతాస్పత్రి సూపరిండింటెంట్ ఆళ్ల హరీష్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం పారిశుద్ధ్యం నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ చిల్లకల్లులో అన్నివార్డుల్లోని చెత్త కుప్పలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నట్లు వివరించారు. గౌరవరంలో ఈవోపీఆర్డీ పద్మావతి ఆధ్వర్యంలో చెత్త కుప్పలను తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివాజీ, సంక్రాంత్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. అనుమంచిపల్లి, గండ్రాయి, బండిపాలెం, పోచంపల్లి గ్రామాల్లో స్వచ్ఛదివస్‌ను నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. సర్పంచులు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గండేపల్లిలో స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న సర్పంచి రవికుమార్, అధికారులు



పెనుగంచిప్రోలులో చెత్తాచెదారాలను తొలగిస్తున్న ఎంపీడీవో శ్రీను, సిబ్బంది

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని ఎంపీడీవో జి.శ్రీను సూచించారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి ఆమె శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈవోపీఆర్డీ సుబ్బారావు, ఏవో సిద్దారెడ్డి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో గ్రామంలోని చెత్తచెదారాలను యంత్రాల సహాయంతో తొలగించారు. అనంతరం ప్రధాన సెంటర్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి కల్పించాలంటూ ఆందోళన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేటకు మంచినీటి వసతి కల్పించాలంటూ కాలనీవాసులు శనివారం ఆందోళన చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. దీంతో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తమకు మంచినీటి వసతి కల్పించాలంటూ కాలనీవాసులు నినాదాలు చేశారు.

సమస్యలను పరిష్కరించాలి: తన్నీరు

విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకుని కాలనీవాసులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ విలియంపేటలో 5 నెలలుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సుమారు 200 గృహాలకు మంచినీరు అందక కాలనీవాసులు అవస్థలుపడుతున్నారన్నారు. సమస్యను కాలనీవాసులు ఇప్పటికే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల అధ్వానంగా ఉన్నాయన్నారు. వీధిదీపాలు, లోటట్టేజీ సమస్యతో కాలనీవాసులు అవస్థలుపడుతున్నారు. ఇకనైనా మున్సిపల్, ఆయాశాఖల అధికారులు స్పందించి విలియంపేట కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యతోపాటు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, బూడిద నరసింహారావు, స్థానిక నాయకుడు ఉప్పెలి పెంటయ్య, గొట్టిపాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విలియంపేటలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదు : ఎస్ఐ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ విధిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక ప్రధాన సెంటరులో శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగంపై ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఎస్ఐ వివరించారు.

టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు



కీసర టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

కంచికచర్ల: తెలుగు పండుగ సంక్రాంతి పర్వదినం మూడు రోజులపాటు కుటుంబసభ్యులతో ఆనందంగా, ఆహ్లాదంగా జరుపుకున్నవారు తిరిగి విధి నిర్వహణ కోసం హైదరాబాద్, బెంగుళూరు తదితర నగరాలకు శనివారం తరలివెళ్లారు. దీంతో కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద కార్లు, ఇతర వాహనాలు సాయంత్రం బారులుదీరాయి. శనివారం సాయంత్రం వరకు 8,500 వాహనాలు హైదరబాద్ వైపునకు వెళ్లాయని స్వర్ణటోల్ ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు. టోల్‌ప్లాజా వద్ద మూడు సెకన్లు కన్నా మించి సమయం ఆగకుండా వాహనాలు వెళ్తున్నాయని ఆయన వివరించారు.

రహదారి భద్రత జీవితానికి రక్ష



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



పేటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది, పక్కన ఎంవీఐ రాజు తదితరులు

నందిగామటౌన్: రహదారి భద్రత నిండు జీవితానికి రక్ష అని నందిగామ రవాణా శాఖాధికారి పద్మావతి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏరియా ఆస్పత్రి, స్వర కెఎంఆర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నందిగామలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది వాహనాల డ్రైవర్లు, ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహన చోదకులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. నిద్ర మత్తు, అతి వేగం కారణంగానే అధిక శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నవైనాన్ని గుర్తుచేశారు. వాహన చోదకులు విధిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ జయచంద్ర, పరిపాలన అధికారి ప్రభాకర లింగం, వైద్యులు మానీష్, శేషుకుమారి, అరవింద్ సూర్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జగ్గయ్యపేటలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ఎంవీఐ ఎంవీఎన్ రాజు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ప్రతి డ్రైవర్ మంచి కంటిచూపు కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాహనాల నిబంధనలను తప్పక పాటించాలని అన్నారు. అతివేగంతో వాహనాలు నడపవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను గానీ, గూడ్స్ సరుకులను గానీ ఎక్కించవద్దని డ్రైవర్లను ఆదేశించారు. ఎక్సైజ్ సీఐ బి.గురవయ్య, ఎస్ఐ. టి.చిట్టిబాబు, ప్రభుత్వ వైద్యాధికారి ఎ.హరీష్, ఆర్‌అండ్‌బీ డీఈఈ పరశురాముడు, ఎంవీఐ కార్యాలయం సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ షేక్ ఆలం, సిబ్బంది శరత్‌చంద్ర, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ఆర్.గోపికృష్ణ, పీఎంవోకే మల్లేశ్వరి, వై.కీర్తిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు నివాళి

జగ్గయ్యపేట అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అయ్యప్పనగర్‌కు చెందిన రేషన్ డీలర్ రావి రోహిణిప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శనివారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రోహిణిప్రసాద్‌కు నివాళులర్పించిన వారిలో ఆపార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, కన్నమాల శామ్యూల్, ఉపేందర్‌రెడ్డి, గొట్టిపాల సురేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి



కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర సెయింట్ లసాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ సహాయరాజు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి వారు భవిష్యత్‌లో ఉన్నతస్థితికి చేరేలా తీర్చిదిద్దాలని సూచించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ థామసన్, లసాల్ ఇండియన్ కాంగ్రిగేషన్ అధిపతి బ్రదర్ అమలన్‌థామస్, రాబర్ట్, ఆంతోని, బీజేటీ కళాశాల డీన్ దుగ్గిరాల ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.